జాతీయ రహదారిపై అంధకారం

- నిడిగొండలో వారం రోజులుగా వెలగని లైట్లు
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నిర్లక్ష్యం

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో జాతీయ రహదారి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వారం రోజులుగా వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లైట్లు వెలగడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు కమ్ముకోవడంతో ప్రజలు రహదారి దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సర్వీస్ రోడ్డు గుండా వెళ్లే పలు గ్రామాల ప్రజలు చీకట్లో ఇబ్బందులకు గురవుతున్నారు. యూ టర్న్‌ల వద్ద సరిగా ప్రమాదపు హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో రాత్రి పూట వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి లైట్లు వెలిగించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని నిడిగొండ గ్రామానికి చెందిన పలువురు పేర్కొన్నారు.


నిడిగొండలో జాతీయరహదారిపై వెలగని లైట్లు

క్లుప్తంగా

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థినులు


కుశల


తులసి


శ్రావణి

పాలకుర్తి: మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. పెద్ద తండా(కె)కు చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్ కూతురు లావుడ్య తులసి, తీగారం గ్రామానికి చెందిన పోగు శ్రావణి, పాలకుర్తికి చెందిన పెనుగొండ కుశల నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి మెడికల్ సీట్లు సాధించారు. కాగా, బుధవారం పాఠశాలల యాజమాన్యంతోపాటు గ్రామస్తులు, తల్లిదండ్రులు వారిని అభినందించారు.

నివాళి



రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం అధ్యక్షుడు రాసమల్ల ఎల్లస్వామి తల్లి ఎల్లమ్మ (69) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు రాసమల్ల కొమురయ్య, ఎడ్ల యాకస్వామి, మరికుక్కల రాజు, నరహరి, యాదగిరి, సీతారాములు, మద్దెల స్వామి, నరసింహులు, సత్తయ్య, ఉప్పలయ్య ఉన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ప్రవీణ్‌కుమార్



బచ్చన్నపేట: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఆయన నివాసంలో బుధవారం లింగంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం సుబ్బారెడ్డితో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు.

వృథాగా భగీరథ నీరు


ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీరు

బచ్చన్నపేట: మండలంలోని నక్కవానిగూడెం గ్రామంలో వాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. బుధవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంకు నిండి పోతోంది. పాఠశాల ఆవరణలో నీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయంగా మారుతోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికి గురవుతున్నది. ఇప్పటికైనా వాటర్ ట్యాంకు నిండగానే నీటి సరఫరాను సంబంధిత అధికారులు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుర్చీ కలలు..!

- స్థానిక ఎన్నికల్లో నాయకుల ఆశలు

జనగామ: స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం మొదలవగానే గ్రామాలు, మండలాలు రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖాళీ అవుతాయని తెలిసిన నాటి నుంచే ఆశావహుల గుండెల్లో 'కుర్చీ' కలలు తెరపైకి వచ్చాయి. ఈ చిత్రంలో చూపినట్లుగా ఓ నేత మనసులో ఒక్క ఆలోచనే తిరుగుతూ ఉంది. ఎన్నికల తర్వాత ఆ కుర్చీ నాది కావాలి అన్న తపన. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో అధికార పీఠం కైవసం చేసుకునేందుకు తహతహలాడి పోతున్నారు. గ్రామాల్లో కొత్త స్నేహం, విభేదాలను పక్కనబెట్టి పాత వర్గాల కలయిక.. ఇవన్నీ ఇప్పుడు సర్వసాధారణ దృశ్యాలు. ఇదంతా కుర్చీ కోసం జరుగుతున్న ప్రయత్నాలే అంటూ ఓటర్లు చర్చించుకోవడం గమనార్హం. కుర్చీ కోసం కలలు కంటున్నా, ప్రజా సేవ కోసం కృషి చేస్తేనే ఆ పీఠం చెల్లుబాటు అవుతుందని పలువురు సీనియర్ సిటిజన్లు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిమ్మ జయపాల్‌రెడ్డి గీసిన ఈ చిత్రం ఎన్నికల సీజన్ కావడంతో రాజకీయ పటంలో చమత్కారంగా ప్రతిబింబిస్తోంది.


రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఉపాధ్యాయుడు గీసిన చిత్రం

డిజిటల్ లైబ్రరీ సేవలు వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ సేవలను అందరూ వినియోగించుకోవాలని లైబ్రరీ నిర్వాహకుడు రాపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా ఇక్కడ ఈ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కలెక్షన్ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ రిసోర్సెస్, ఈ–బుక్స్, స్టడీ మెటీరియల్, వీడియోస్ లైబ్రరీలో అందుబాటులో ఉంటాయన్నారు. దీనిపై శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్లు కూడా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాపెల్లి చంద్రమౌళి, శంకరమ్మ, జ్యోతి, ప్రసాద్, పురాణం శ్రీనివాస్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

మాజీ కౌన్సిలర్ మారం లక్ష్మీనారాయణ మృతి

జనగామ: జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మారం లక్ష్మీనారాయణ (94) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మీనారాయణ జనగామ పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత రెండో వార్డు కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పట్టణ అభివృద్ధిలో మారం కృషి మరువలేనిది. సామాజిక స్పృహ కలిగిన లక్ష్మీనారాయణ లయన్స్ క్లబ్ జనగామ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. 1976లో క్లబ్ ఆవిర్భావం నుంచి సభ్యుడిగా కొనసాగిన ఆయన అధ్యక్షుడి వరకు బాధ్యతలు నిర్వహించారు. 320హెచ్ జిల్లా మాజీ గవర్నర్ పబ్బా రవీంద్రనాథ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ డి.లవకుమార్‌రెడ్డి, కన్న పరశురాములు, మాజీ కౌన్సిలర్లు మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, ధర్మపురి శ్రీనివాస్, చాంబర్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు పోకల లింగయ్య, పజ్జూరి గోపయ్య, ఎర్రమల్ల సుధాకర్ తదితరులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి నలుగురు కుమారులు నర్సింహ, శ్రీనివాస్, ప్రవీణ్, రవి, కూతురు ఉన్నారు.


లక్ష్మీనారాయణ(ఫైల్)

'సీజేఐపై దాడికి యత్నం సరికాదు'

దేవరుప్పుల: దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడికి యత్నం సరికాదని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు రాపాక శ్రీశైలం తీవ్రంగా ఖండించారు. దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజు అని, భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ స్వతంత్ర, లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ, ఆధిపత్య కులాల నుంచి అవమానాలు మాత్రం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారి సిద్ధించినప్పుడే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కావన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు కన్న రాజ్యాధికార సాధన కోసం మాన్యవర్ కాన్షీరామ్ స్థాపించిన బీఎస్పీని ప్రజలు ఆదరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

జనగామ: పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన ఫొటో స్టూడియో నిర్వాహకుడు గణపురం వినోద్ కుమార్(22) ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. చిన్న గేటు గల్లీ ఏరియాలో ఫొటో స్టూడియోపై జీవనం సాగిస్తున్న యువకుడు కొద్ది రోజులుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో అప్పులు కాగా, తీర్చే పరిస్థితి లేక ఈ నెల7వ తేదీన ఇంటి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. అప్పులకు గల కారణాలు ఏమై ఉండవచ్చనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్సై రాజన్‌బాబు మాట్లాడుతూ మృతికి సంబంధించి సమాచారం వచ్చిందని, నేడు పిటిషన్ వచ్చిన తర్వాత వివరాలను వెల్లడిస్తామన్నారు.


వినోద్ కుమార్ (ఫైల్)

భూగర్భజలాల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: భూగర్భజలాల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. భూగర్భ జల అంచనా సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో జిల్లాలో భూగర్భజల వనరులను సంరక్షించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జిల్లా భూగర్భ జల అధికారి సీహెచ్ నర్సింహులు, డీఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రధానమంత్రి ధన్–ధాన్య కృషి యోజన కార్యక్రమంపై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ, నీతిఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. రాష్ట్రం నుంచి జనగామ జిల్లా ఎంపిక కాగా ఈసందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది పథకం లక్ష్యాలను వివరించారు. అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు.


ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా , అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

ఈవీఎం గోదాం పరిశీలన

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా కార్యాలయ సముదాయంలో ఉన్న ప్రధాన ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్ హుస్సేన్, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైభవానికి పాటుపడుదాం

దేవరుప్పుల: ప్రజాపాలనతో ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైభవం కోసం సమన్వయంతో కలిసి పాటుపడుదామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పెద్దమడూర్, సింగరాజుపల్లి, సీతారాంపురం, కడవెండి, అప్పిరెడ్డిపల్లి ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల్లో అభ్యర్థుల ఖరారు కోసం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, జిల్లా కార్యదర్శులు ధర్మారెడ్డి, పాండు కృష్ణ, ఉప్పల సురేష్, రతన్‌జీ, నాగరాజు పాల్గొన్నారు.

స్థానికంలో కాంగ్రెస్ జెండా ఎగురేయాలి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చే అభ్యర్థులను గెలిపించి పార్టీ ఖ్యాతిని మరోసారి ఇముడింపజేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రసాద్‌రెడ్డి, రామచంద్రయ్య, నాగరాజు, సునీల్ రెడ్డి, వెంగల్‌రావు, మధుసూధన్, రాజేష్‌నాయక్, యాకేష్, రవిందర్, గఫూర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చిల్పూరు: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నారాయణపేట జిల్లా కోస్గి మండల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు.. హెచ్‌ఎం వాణి రాణి ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో శ్రీనివాసులు తదితరులు

పత్తి పంటను సీసీఐకి విక్రయించాలి

బచ్చన్నపేట: అన్నదాతలు పండించిన పత్తి పంటను నేరుగా సీసీఐకి విక్రయించాలని, మధ్య దళారులను ఆశ్రయించొద్దని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.8,110 ఉందన్నారు. ముందుగా ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర పంటల వివరాలను నమోదు చేసుకోవాలని, అలాగే ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకు కూడా చేసుకోవాలని అన్నారు. ఆధార్ కార్డు, పట్టేదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను సీసీఐ అధికారులకు అందించాలన్నారు. పంట డబ్బులు నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

- సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ ఫణికిషోర్, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎస్సై దూదిమెట్ల నరేష్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేయడం, నిల్వ చేయడం నిషేధించామన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కీలక గ్రామాలు, సాధారణ గ్రామాలపై సమీక్ష జరిపి, ఎన్నికల నియమాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించేలా అన్ని విభాగాల అధికారులకు తగు సూచనలు అందించారు.


ఇసుక అక్రమ రవాణాపై సమీక్షిస్తున్న సీఐ, తహసీల్దార్

కుక్కల దాడిలో 12 గొర్రె పిల్లలు మృత్యువాత

తరిగొప్పుల: మండలంలోని జాలుబాయితండాలో బుధవారం మధ్యాహ్నం కుక్కల దాడిలో 12 గొర్రె పిల్లలు మృతిచెందాయి. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సభావత్ భీవనాయక్ జీవాలను పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా, బుధవారం గొర్రె పిల్లలను దొడ్డిలో ఉంచి మందను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో అటుగా వచ్చిన కుక్కలు ఇనుపకంచెపై నుంచి దొడ్డిలోకి దూకి గొర్రె పిల్లలపై దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో 12 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. సాయంత్రం దొడ్డి దగ్గరికి వెళ్లిన బాధితుడు మృతిచెందిన గొర్రె పిల్లలను చూసి నిర్ఘాంతపోయాడు. కుక్కల దాడిలో తమకు రూ.50 వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సభావత్ భీమా నాయక్ కోరారు.


రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

బీఆర్‌ఎస్‌లో చేరిక



దేవరుప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల ఆధిపత్యం కోసం చేజారిన పార్టీ క్యాడర్‌ను తిరిగి చేర్చుకునే రాజకీయ అరంగేట్రంతో మొన్న ఆ పార్టీ.. నేడు ఈ పార్టీలో పదనిసల చేరికల సందడి మొదలైంది. రెండు రోజుల కింద మండల కేంద్రంలోని దాదాసాహెబ్‌కాలనీకి చెందిన ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తిరిగి అవే కుటుంబాల్లో కొందరు బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల నాయకుడు ఏల సుధాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరడం సర్వత్రాచర్చంశీయంగా మారింది.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో లిటరసీ ప్రాజెక్టు బెంగళూరు ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వాహకుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి అనంతరం ఆయా విద్యార్థుల ఆసక్తిని బట్టి అందులోనే ఉన్నత విద్యను అభ్యసిస్తే జీవితంలో స్థిరపడుతారని సూచించారు. అదే విధంగా టెన్త్ అనంతరం ఉండే కోర్సులను వివరించారు. ప్రిన్సి పాల్ సునీత, కెరీర్ గైడెన్స్ ఇన్‌చార్జులు శారద, సుధాకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అదేవిధంగా బాలల భద్రత, లైంగిక దాడి నివారణపై టీ–సాట్ ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఇందులో ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ సునీతకృష్ణన్ అనేక విషయాలను వివరించారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అజయ్‌కుమార్

సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

రఘునాథపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి పిలుపునిచ్చారు. బుధవారం కంచనపల్లిలో దైద దానియేలు అధ్యక్షతన జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాడే సీపీఐ అభ్యర్థులను ఆదరించి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు పసుల దానియేలు, కందుకూరి కందుకూరు మల్లేశం, సమ్మయ్య, వెంకటయ్య, ప్రవీణ్, మహేందర్, ఏలియా, సుధాకర్, దయాకర్, యాకమ్మ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేశ్ కోరారు. ఉప్పుగల్లు గ్రామంలో పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సీపీఐని ప్రజలు ఆదరించాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు సీపీఐలో చేరగా వారికి రమేశ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రమేశ్

ఒకరి రిమాండ్

దేవరుప్పుల: వ్యక్తిపై దాడికి పాల్పడిన విషయమై కేసు విషయంలో ఒకరిని రిమాండ్ చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వారాల మల్లేష్ అనే వ్యక్తి ఈ నెల 23న అదే గ్రామానికి చెందిన పడకంటి బ్రహ్మచారి అనే వ్యక్తిని కర్రతో కొట్టడం వల్ల అతని చెయ్యి విరిగి తీవ్రగాయాలపాలయ్యారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సదరు వ్యక్తి మల్లేష్‌ను బుధవారం అరెస్టు చేసి జనగామ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై వివరించారు.

రోజుకో సారు.. పిల్లలు రారు

బచ్చన్నపేట: మండలంలోని నక్కవానిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు రోజుకు ఒక సారు డిప్యుటేషన్‌పై వస్తున్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు అసలే లేరు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 12 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రమోషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి వేరే ఉపాధ్యాయులు రాకపోవడంలో ఎంఈఓ ఎంఆర్‌సీలతో విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. వారు రాకపోవడంతో వేరే పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపిస్తున్నారు. వారు కూడా ఒక రోజు మాత్రమే వచ్చి మళ్లీ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం 12 గంటలకు వరకు ఏ ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత రామచంద్రాపూర్ పాఠశాల టీచర్ సద్గుణాచారి వచ్చినా పాఠశాలలో విద్యార్థులు లేరు. దీంతో తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందో అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు పర్మనెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థులు లేక వెలవెల బోతున్న తరగతి గది


నక్కవాని గూడెం ప్రాథమిక పాఠశాల

పిల్లలకు పోషకాహారం అందించాలి

జనగామ రూరల్: పిల్లలకు పోషకాహారం అందించాలని పంచాయతీ కార్యదర్శి కన్న రాజు అన్నారు. బుధవారం చౌడారం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్–1 లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. టీచర్లు జగదాంబ, రేణుక, వసంత, ఆశ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు, తదితరులు